వక్ఫ్ సమావేశం రసాభాస

గాజు సీసాను పగులగొట్టిన టీఎంసీ ఎంపీ.. చేతికి గాయం

న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లుపై నిర్వహించిన పార్లమెంటరీ కమిటీ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో అనుచితంగా ప్రవర్తించిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీని ఒక రోజు పాటు సస్పెండ్ చేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై మంగళవారం జరిగిన సమావేశంలో హైడ్రామా చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి, బీజేపీ నేత అభిజిత్ గంగోపాధ్యాయతో జరిగిన వాగ్వాదంలో ఎంపీ బెనర్జీ ఒక గాజు సీసాను పగులగొట్టి దానిని ప్యానల్ చైర్మన్ జగదాంబికా పాల్ పైకి విసిరారు. ఈ క్రమంలో బెనర్జీ బొటన, చిటికెన వేలుకు గాయమైంది. బెనర్జీ చర్యను నిరసిస్తూ చేసిన తీర్మానాన్ని ప్యానెల్ 9-8తో ఆమోదించడంతో అతడిని ఒక రోజు పాటు సస్పెండ్ చేశారు.

బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే కోటి రివార్డు

క్షత్రియ కర్ణిసేన ఆఫర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే రూ.1.11 కోట్ల పారితోషికం ఇస్తానని క్షత్రియ కర్ణి సేన ఆఫర్ చేసింది. గతేడాది డిసెంబర్‌లో లారెన్స్ బిష్ణోయ్ ముఠా చేతిలో హత్యకు గురైన ప్రముఖ రాజ్‌పుత్ నాయకుడు సుఖ్‌దేవ్ సింగ్ గొగమెది చావుకు ప్రతీకారంగా ఈ ఆఫర్‌ను ప్రకటించినట్టు కర్ణి సేన నాయకుడు రాజ్ షెకావత్ ప్రకటించారు. బిష్ణోయ్‌ను చంపే ఏ పోలీస్ అధికారికైనా తాను ప్రకటించిన నజరానా అందిస్తానని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి అయింది. గొగమెది హత్య కేసులో ప్రధాన అనుమానితుడితో పాటు మరో ఎనిమిది మందిని రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

సీఎంనైనా సొంతిల్లు లేదు!: సిద్ధరామయ్య

మైసూర్: ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు సొంత ఇల్లు కూడా లేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చెప్పుకొచ్చారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని పేర్కొన్నారు. తన నియోజకవర్గం వరుణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన తాను రెండోసారి ముఖ్యమంత్రి కావడాన్ని విపక్షాలు, ముఖ్యంగా బీజేపీ తట్టుకోలేక పోతున్నదని అన్నారు. ఒక బీసీ ముఖ్యమంత్రి కావడం బీజేపీకి ఎంతమాత్రం ఇష్టం లేదని, సామాజిక న్యాయానికి, పేదలకు ఆ పార్టీ వ్యతిరేకమని విమర్శించారు.

క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు

'సనాతన' వ్యాఖ్యలపై ఉదయనిధి స్టాలిన్

చెన్నై, అక్టోబర్ 22: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తన వ్యాఖ్యలపై తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ వెనక్కి తగ్గటం లేదు. తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని తాజాగా స్పష్టం చేశారు. సోమవారం ఓ ఆదర్శ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 'తమిళనాడులోనే గాక భారతదేశంలో అనేక చోట్ల నాపై కోర్టుల్లో కేసులు ఉన్నాయి. ఈ కేసులన్నీ వక్రీకరణల ఆధారంగా పెట్టారు. నేను కలైంజ్ఞర్ దివంగత సీఎం కరుణానిధి మనవడ్ని. ఈ అంశంలో క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదు' అని అన్నారు. తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దాలని చూస్తున్నారని, నవ వధూవరులు తమకు పుట్టబోయే పిల్లలకు అందమైన తమిళ పేర్లే ఎంచుకోవాలని కోరారు.

ఒంటరితనంతో 'డిమెన్షియా' ముప్పు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ఒంటరితనంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజిక సంబంధాలు సరిగాలేక తీవ్రమైన అసంతృప్తితో బతికేవాళ్లు 'డిమెన్షియా' (చిత్త భ్రంశం) బారినపడే ముప్పు 30 శాతం ఎక్కువగా ఉంటుందని తాజా నివేదిక ఒకటి తేల్చింది. వయసు, లింగంతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరు లక్షల మంది పాల్గొన్న 21 దీర్ఘకాలిక అధ్యయనాల్లోని సమాచారాన్ని నిపుణులు విశ్లేషించారు. సామాజిక సంబంధాలు సరిగాలేకపోవటం, ఒంటరితనం.. రెండూ 'డిమెన్షియా'తో సంబంధమున్నవేనని, దీంతో సదరు వ్యక్తి ఆలోచన, జ్ఞాపక శక్తి, నిర్ణయాలు తీసుకోవటం వంటివి ప్రభావితమవుతాయని నివేదిక పేర్కొన్నది.

గుజరాత్‌లో నకిలీ కోర్టు

అహ్మదాబాద్: నకిలీ టోల్ ప్లాజా, నకిలీ బ్యాంకు, నకిలీ పోలీస్ స్టేషన్ తర్వాత తాజాగా గుజరాత్‌లో నకిలీ కోర్టు వెలుగుచూసింది. ఓ వ్యక్తి ఏకంగా నకిలీ ట్రిబ్యునల్‌నే ఏర్పాటు చేసి జడ్జిగా అవతారమెత్తి తీర్పులు కూడా ఇచ్చేశాడు. ఇప్పుడు తీరిగ్గా కటకటాలు లెక్కపెట్టుకుంటున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిందీ ఘటన. ఇందుకోసం నిందితుడు తన ఆఫీసు రూమును అచ్చం కోర్టు రూములా మార్చేశాడు. ఓ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లో తన క్లయింట్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చేశాడు. ఈ కేసులో ఏకంగా కలెక్టర్‌కే ఉత్తర్వులు జారీచేసి దొరికిపోయాడు. నిందితుడిని మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌గా గుర్తించారు. గత ఐదేళ్లుగా అతడు ఇదే పనిలో ఉన్నట్టు గుర్తించారు. అతడిచ్చిన ఉత్తర్వులను నకిలీవిగా గుర్తించిన సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సిటీ సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల కేసులకు సంబంధించిన వ్యక్తులను ట్రాప్ చేసి తన కోర్టుకు రప్పించుకునేవాడు. త్వరితగతిన పరిష్కారాలు చూపుతానని చెప్పి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసేవాడని విచారణలో తేలింది. అతడి సహచరులు కోర్టు సిబ్బందిగా వ్యవహరించేవారు. కాగా, 2015లోనే అతడిపై చీటింగ్ కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.

భూమిని చల్లార్చేందుకు 'డైమండ్ డస్ట్'



న్యూయార్క్, అక్టోబర్ 22: పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి భూమికి రక్షణ కల్పించేందుకు డైమండ్ డస్ట్‌ను ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు కొత్త ప్రతిపాదన చేశారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు 'జియోఫిజికల్ రిసెర్చ్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. ప్రతియేటా 50 లక్షల టన్నుల డైమండ్ డస్ట్‌ను భూమి ఎగువ వాతావరణంలో వెదజల్లాలని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. తద్వారా భూమిపై 1.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని తెలిపారు. డైమండ్ డస్ట్‌ను భూమి ఎగువ వాతావరణంలో వెదజల్లితే అది అద్దంలా పని చేస్తుందని, భూమిపై పడాల్సిన సూర్యకిరణాలను అడ్డుకొని, తిరిగి అంతరిక్షంలోకే ప్రతిబింబించేలా చేస్తుందని చెప్పారు. ఇలా అంతరిక్షంలో ఏవైనా పదార్థాలను వెదజల్లి సూర్యకిరణాలను అడ్డుకొని, భూమిపై వాతావరణాన్ని తగ్గించే ప్రక్రియను సోలార్ రేడియేషన్ మేనేజ్‌మెంట్(ఎస్ఆర్ఎం) అంటారు. గతంలో ఎస్ఆర్ఎం కోసం సల్ఫర్, కాల్షియం, అల్యూమినియం, సిలికాన్ వంటి వాటిని వినియోగించవచ్చని పలు ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే, ఇందుకోసం డైమండ్ డస్ట్ మెరుగ్గా పని చేయగలదని తాజాగా శాస్త్రవేత్తలు తెలిపారు.

రైలు దుప్పట్లు నెలకోసారే వాషింగ్!

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు ఇది చేదు వార్తే. ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే దుప్పట్లను నెల కోసారి మాత్రమే ఉతుకుతారట. ఈ విషయాన్ని స్వయంగా రైల్వేనే వెల్లడించింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నకు రైల్వే ఇచ్చిన ఈ సమాధానం ప్రయాణికులను ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. ఏసీ కోచ్‌లలో ప్రయాణించే వారికి రైల్వే ఓ బెడ్‌షీట్, తలగడ, దుప్పటిని కవర్‌లో పెట్టి అందిస్తుంది. తెల్లగా ఉండే ఇవి చూడగానే శుభ్రంగా ఉన్న భావనను కలిగిస్తాయి. నిజానికి ఈ భావన తప్పని తాజాగా తేలిపోయింది. ప్రయాణికులకు అందించే బెడ్‌షీట్, పిల్లో కవర్లను మాత్రం ఒకసారి ఉపయోగించిన తర్వాత ఉతుకుతారట. కానీ, దుప్పట్లను మాత్రం వాటి పరిస్థితిని బట్టి నెల, రెండు నెలలకోసారి మాత్రమే శుభ్రం చేస్తారట. అంటే ఒకరు ఉపయోగించిన దుప్పటిని వందలాదిమంది ప్రయాణికులు ఉపయోగిస్తారన్నమాట. రైలు జర్నీ పూర్తి చేసుకున్న తర్వాత దుప్పట్లను శుభ్రంగా ప్యాక్ చేసి యథాస్థానంలో పెడతారట. అవి దుర్వాసన వస్తున్నా, మురికిగా అనిపించినా అప్పుడు మాత్రమే వాటిని లాండ్రీకి పంపిస్తామని ఆర్టీఐ కింద అడిగిన ప్రశ్నకు రైల్వే సమాధానం ఇచ్చింది.

విమానయానం ఆగమాగం

- 9 రోజుల్లో 170 విమానాలకు బాంబు బెదిరింపులు
- విమానయాన సంస్థలకు 600 కోట్ల మేర నష్టం!
- 24 గంటల్లోనే 80 విమానాలకు బెదిరింపులు
- మూడు అంతర్జాతీయ సర్వీసుల దారి మళ్లింపు
- కేంద్రమంత్రి హెచ్చరించినా ఆగని బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు పెద్ద సమస్యగా మారిపోయింది. ఫోన్‌లు, ఈమెయిళ్లు, సోషల్ మీడియా ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు చేస్తున్న బెదిరింపులతో విమాన ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. బాంబు బెదిరింపులను అడ్డుకునేందుకు భద్రతా సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి హెచ్చరించినప్పటికీ దుశ్చర్యలు ఆగడం లేదు. గత తొమ్మిది రోజుల్లోనే 170 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

బెదిరింపులతో ఆగమాగం

'విమానంలో బాంబు పెట్టాం' అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ(బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి. గత తొమ్మిది రోజుల్లో వచ్చిన బాంబు బెదిరింపులకు విమానయాన సంస్థలు దాదాపుగా 600 కోట్లు నష్టపోయి ఉంటాయని గతంలో ఓ విమానయాన సంస్థలో పని చేసిన ఓ అధికారి తెలిపారు. సాధారణంగా ఒక డొమెస్టిక్ విమాన సర్వీసుకు అంతరాయం కలిగితే సగటున రూ.1.5 కోట్లు నష్టం వస్తుందని, అంతర్జాతీయ విమానానికి ఇది దాదాపు రూ.3.5 కోట్ల వరకు ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

కఠిన నిబంధనల తీసుకొచ్చే అవకాశం

విమానాలకు వస్తున్న బెదిరింపులన్నీ నకిలీవే. ఇంతకుముందు అడపాదడపా ఇలాంటి బెదిరింపులు వచ్చేవి. ఇవి చాలావరకు ఆకతాయిలు చేసే పనులే అయి ఉండేవి. ఇప్పుడు మాత్రం ఒకేసారి పెద్ద ఎత్తున బెదిరింపులు వస్తుండటంతో కుట్రకోణం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి తోడు నవంబరు 1 నుంచి 19 వరకు ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని ఖలిస్థానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ హెచ్చరించాడు. దేశంలో విమానయాన రంగానికి ఆటంకం కలిగిస్తున్న బాంబు బెదిరింపులకు అడ్డుకట్ట వేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. బెదిరింపులకు పాల్పడే వారిని నో ఫ్లై లిస్టులో చేర్చి ఎప్పుడూ విమానాలు ఎక్కకుండా నిషేధించాలని విమానయాన శాఖ భావిస్తున్నది. దీంతో పాటు బెదిరింపులకు పాల్పడిన వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేసేలా సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్స్ అగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్(స్వాస్కా చట్టం)-1982కు సవరణ చేయాలని నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్ సీఆర్‌పీఎఫ్ స్కూల్‌కు బెదిరింపు

హైదరాబాద్‌లోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ పాఠశాలకు బాంబు బెదిరింపు వచ్చింది. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, పంచకుల(హర్యానా), రాంపూర్(ఉత్తరప్రదేశ్)లోని సీఆర్పీఎఫ్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలను పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఈమెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అవి ఉత్తుత్తివని తేలడంతో మంగళవారం ప్రశాంతంగా తరగతులు జరిగాయని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా, దుండగుడు పంపిన ఈమెయిల్‌లో తమిళనాడు రాజకీయాల గురించి, ఉద్వాసనకు గురైన డీఎంకే కార్యకర్త జాఫర్ సాదిక్ గురించి ప్రస్తావించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఇదేనా బ్రాండ్ బెంగళూరు?

నీటితో నిండిన గోతిలో పడ్డ దివ్యాంగ మహిళ

రోడ్ల దుస్థితిపై కాంగ్రెస్ సర్కారుపై పౌరుల ఆగ్రహం

బెంగళూరు: అసలే గోతులతో నిండిన రోడ్లు.. ఆపై భారీ వర్షాలు.. ఇంకేముంది ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి కర్ణాటక రాజధాని బెంగళూరు రహదారులు. తాజాగా బెంగళూరు తూర్పు సబర్బన్‌కు చెందిన వర్తూరులోని ఒక వీధిలో దివ్యాంగ మహిళ ఒకరు మూడు చక్రాల స్కూటర్‌పై వస్తూ నీటితో నిండిన రోడ్డుపై అదుపుతప్పి గోతిలో పడిపోయింది. దీంతో గోతిలోంచి బయటకు రాలేక ఇబ్బంది పడుతున్న ఆమెకు స్థానికులు సహాయం చేశారు. దీంతో రోడ్ల దుస్థితిపై నెటిజన్లు కాంగ్రెస్ నేతృత్వంలోని సిద్ధరామయ్య ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదేనా బ్రాండ్ బెంగళూరు? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

బెంగళూరును ముంచెత్తిన వానలు

బెంగళూరులో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెగని వర్షాలకు 5 మంది మరణించారు. పలు నివాస ప్రాంతాలు, రోడ్లపై మోకాలి లోతు నీళ్లు చేరాయి. మంగళవారం కేవలం 6 గంటల సమయంలో యెలహంకలో 157 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలిపారు.బాబుసాపాళ్యలో భారీ వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న ఒక భవనం కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, ఇద్దరిని రక్షించారు. మరో 12 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

కర్ణాటకలో మరో ల్యాండ్ స్కామ్

- అటవీ భూమి కాజేసిన కాంగ్రెస్ మంత్రి!
- వెంటనే పదవి నుంచి తొలగించాలి
- గవర్నర్‌కు హక్కుల కార్యకర్త విజ్ఞప్తి

బెంగళూరు, అక్టోబర్ 22: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మరో ల్యాండ్ స్కామ్ వెలుగుచూసింది. పార్టీ అగ్రనేతలు సీఎం సిద్ధరామయ్య, మల్లికార్జున ఖర్గే ఇప్పటికే భూ వివాదాల్లో చిక్కుకోగా, తాజాగా మంత్రి బోస్‌రాజ్‌పైనా భూకబ్జా ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఐదు ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి, తన భార్య పేరున రిజిస్టర్ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. వెంటనే ఆయనను మంత్రి వర్గం నుంచి తప్పించాలని సామాజిక కార్యకర్త దినేశ్ కల్లహళ్లి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు దాఖలు చేశారు.

కోట్ల విలువైన అటవీ భూమి కబ్జా

కొంతమంది భూ ఆక్రమణదారులతో కుమ్మకైన బోస్‌రాజు రాయ్‌చూర్ జిల్లాలోని బీట్ గ్రామంలో 16.21 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారని, అందులో ఐదు ఎకరాలు ఆయన భార్య కృష్ణవేణి పేరుతో రిజిస్టర్ చేశారని దినేశ్ చెప్పారు. దీనిపై 2022-23లో అటవీ శాఖ అతని భార్యను నిందితురాలిగా పేర్కొంటూ కేసు కూడా పెట్టినట్టు చెప్పారు. ప్రస్తుతం ఆ భూమి ఖరీదు కోట్లలో ఉందని, అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించిన బోస్‌రాజ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగిస్తూ సిఫార్సు చేయాలని ఆయన కోరారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను బోస్‌రాజు తీవ్రంగా ఖండించారు. తనపై చేసిన ఆరోపణలు నిరాధారం, పరువు నష్టం కలిగించేవని పేర్కొన్నారు. వాస్తవానికి అటవీ శాఖ అధికారులు పెట్టిన కేసును హైకోర్టు కలబుర్గి బెంచ్ అప్పట్లోనే కొట్టివేసిందని చెప్పారు.

యుద్ధ విరమణకు సహకరిస్తాం

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: రష్యా, ఉక్రెయిన్ మధ్య వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నదని ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు స్పష్టంచేశారు. రష్యాలోని కజాన్‌లో జరుగుతున్న బ్రిక్స్ 16వ సదస్సుకు హాజరైన మోదీ మంగళవారం పుతిన్‌తో భేటీ అయ్యారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య సాగుతున్న సాయుధ ఘర్షణను తాము నిత్యం గమనిస్తున్నామని, గతంలో చెప్పినట్టు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నది భారత్ అభిమతమని చెప్పారు. ర ష్యా అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు ఆర్థిక సహకారం, వాతావరణ మార్పులు అం శాలపై విస్తృతంగా చర్చించనున్నాయి.

మరాఠాలు ఎటువైపు?

ఎన్నికల్లో కీలకంగా మారిన మనోజ్ జరాంగే

సొంతంగా అభ్యర్థులను నిలబెట్టనున్నట్టు ప్రకటన

ముంబై, అక్టోబర్ 22: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మరాఠాలు ఎటువైపు ఉంటారనేది కీలకంగా మారింది. రాష్ట్రంలో 33 శాతంగా ఉన్న మరాఠా జనాభా మద్దతు మహాయుతి, మహా వికాస్ అఘాడీ కూటములకు కీలకంగా మారింది. 288 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగిన మహారాష్ట్రలో దాదాపు 160 నియోజకవర్గాల్లో మరాఠాలు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. రిజర్వేషన్ల కోసం ఆరుసార్లు దీక్ష చేసి మరాఠాలకు మనోజ్ జరాంజే పాటిల్ సరికొత్త నాయకుడిగా ఎదిగారు. దీంతో ఇప్పుడు జరాంజే మద్దతు కోసం అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే, ఈ ఎన్నికల్లో త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయనున్నట్టు జరాంగే ప్రకటించారు.

లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతికి దెబ్బ

లోక్‌సభ ఎన్నికల్లో మరాఠా ఉద్యమ ప్రభావం మహాయుతి కూటమిపై పడింది. మరాఠాలు బలంగా ఉండే మరఠ్వాడా ప్రాంతంలో ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో మహాయుతి ఒక్కటీ గెలవలేదు. గత ఎన్నికల్లో జరాంగే ఎవరికి మద్దతు ఇవ్వకపోవడం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)కి కలిసొచ్చింది. ఈసారి మాత్రం ఆయన సొంతంగా అభ్యర్థులను నిలబెడతామని ప్రకటించడం ఎంవీఏను కలవరపరుస్తున్నది. జరాంగే మద్దతుదారులు తమ ఓట్లే చీలుస్తారని భయపడుతున్నది. మరోవైపు మరాఠాల ఓట్లు తగ్గినా ఓబీసీలను ఆకర్షించడం ద్వారా గట్టెక్కాలని మహాయుతి కూటమి వ్యూహాలు రచిస్తున్నది.

'దృశ్యం' సినిమా తరహాలో గర్ల్‌ఫ్రెండ్ హత్య

నాగ్‌పూర్‌లో ఆర్మీ జవాన్ అరెస్టు

నాగ్‌పూర్, అక్టోబర్ 22: మహారాష్ట్ర నాగ్‌పూర్ నగరంలో 'దృశ్యం' సినిమా తరహాలో ఓ హత్య జరిగింది. నగరానికి చెందిన ఓ ఆర్మీ జవాన్ తన గర్ల్‌ఫ్రెండ్‌ను హత్య చేసి, సినిమాలో చూపించినట్టు మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ హత్య జరిగిన తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేసింది. ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్న నిందితుడు అజయ్ వాంఖడే (33)ను నాగ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. మృతదేహాన్ని నాగ్‌పూర్‌లో ఓ రహస్య ప్రదేశంలో పాతిపెట్టాడు. దాన్ని సిమెంట్‌తో కప్పేశాడని పోలీసులు వివరించారు. 'గర్ల్‌ఫ్రెండ్‌తో హాయిగా కొన్నాళ్లు గడిపాడు. వారి వివాహానికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవటంతో, ఆమెను వదిలించుకునేందుకు హత్యకు ప్లాన్ చేశాడు' అని పోలీసులు చెప్పారు. ఆమె కనిపించటం లేదని కుటుంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఆగస్టు 29న ఫిర్యాదు చేశారు. మ్యారేజ్ పోర్టల్ ద్వారా పరిచయమైన జోత్స్న ఆక్రే అనే మహిళను మత్తుమందు ఇచ్చి.. గొంతుకోసి చంపినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

జార్ఖండ్‌లో బీజేపీకి షాక్!

జేఎంఎంలోకి కీలక నేతలు

రాంచీ, అక్టోబర్ 22: జార్ఖండ్ శాసనసభ ఎన్నికలకు కొన్ని వారాల ముందు బీజేపీకి షాక్ తగిలింది! మాజీ ఎమ్మెల్యేలు లుయీస్ మరాండీ, కునాల్ సారంగి, లక్ష్మణ్ తుడు సహా పలువురు పార్టీ నాయకులు సోమవారం జేఎంఎంలో చేరారు. మూడుసార్లు బీజేపీ ఎమ్మెల్యేగా పనిచేసిన కేదార్ హజ్రా, ఏజేఎస్‌యూ పార్టీ నేత ఉమాకాంత్ రజక్ జేఎంఎంలో చేరిన రెండు రోజులకే ఈ పరిణామం చోటు చేసుకుంది. లుయీస్ మరాండీ 2014లో సీఎం హేమంత్ సోరేన్‌ను ఓడించారు. నిబద్ధత కలిగిన తన లాంటి పనిచేసేవారిని నిర్లక్ష్యం చేశారని, పార్టీలో ముఠాతత్వం పెరిగిందని లుయీస్ మరాండీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి రాసిన లేఖలో పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

నస్రల్లా బంకర్‌లో 4 వేల కోట్లు

బంగారం, నగదు రూపంలో దాచిన హెజ్బొల్లా

ఆరోపించిన ఇజ్రాయెల్.. గ్రాఫిక్స్ విడుదల

జెరూసలేం, అక్టోబర్ 22: మరణించిన హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా బంకర్‌లో భారీగా నగదు, బంగారం ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికార ప్రతినిధి డానియెల్ హగరి ఆరోపించారు. గత నెల ఇజ్రాయెల్ జరిపిన దాడిలో హసన్ నస్రల్లా మృతి చెందిన సంగతి తెలిసిందే. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని ఓ దవాఖాన కింద నస్రల్లా నివసించిన బంకర్ ఉందని, అందులో దాదాపు 50 కోట్ల డాలర్ల(రూ.4,200 కోట్లు) విలువైన బంగారం, నగదు ఉన్నట్టు డానియెల్ మంగళవారం పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన గ్రాఫిక్ వీడియో, ఫొటోలను విడుదల చేశారు. అయితే, దవాఖాన కింద ఉన్నందున ఈ బంకర్‌ను తాము లక్ష్యంగా చేసుకోవడం లేదని తెలిపారు. ఈ డబ్బు లెబనాన్ ప్రజల పునరావాసం కోసం ఉపయోగించవచ్చని, కానీ హెజ్బొల్లా పునరావాసం కోసం మళ్లించారని ఆరోపించారు.

ఎవరు గెలిస్తే భారత్‌కు మేలు?

- నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు
- హోరాహోరీగా తలపడుతున్న ట్రంప్, కమల
- భారత్ కోణంలో ఎవరు గెలిస్తే మంచిది?

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: అమెరికా ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడింది. నవంబరు 5న ఎన్నికలు జరగనున్నాయి. రిపబ్లికన్ పార్టీ తరపున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ తరపున ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ హోరాహోరీ తలపడుతున్నారు. ఇప్పటికే ప్రచారం ఊపందుకున్నది. అయితే, భారత్ కోణంలో చూస్తే ట్రంప్ అధ్యక్షుడైతే మంచిదా? భారతీయ మూలాలు ఉన్న కమలా హారిస్ అధ్యక్షురాలైతే మేలా? అనే ఆసక్తికర చర్చ భారత్‌తో పాటు ప్రవాస భారతీయుల్లో జరుగుతున్నది.

ఆర్థిక విధానాలు

వాణిజ్యపరంగా భారత్‌కు అమెరికా చాలా కీలకం. భారతదేశ మొదటి 10 వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో అమెరికాతోనే మనకు ట్రేడ్ సర్‌ప్లస్ ఉంది. అంటే మనం అమెరికా నుంచి చేసుకుంటున్న దిగుమతుల కంటే మనం అమెరికాకు చేస్తున్న ఎగుమతులే ఎక్కువ. భారత్‌తో వాణిజ్యం గురించి ట్రంప్ పదేపదే మాట్లాడుతున్నారు. దిగుమతులపై భారత్ ఎక్కువగా పన్నులు వేస్తున్నదని ఆయన ఆరోపిస్తున్నారు. తాను గెలిస్తే ఈ పరిస్థితిని మార్చేస్తానని చెప్తున్నారు. ఇది భారత్‌కు కొంత ఇబ్బందికరమే. మరోవైపు కమలా హారిస్ సైతం అమెరికా ప్రయోజనాలకు అనుగ